

ముషీరాబాద్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనలో బి. లంక, డాక్టర్ రవికుమార్ తదితరులు

వైద్యురాలి హంతకులను కఠినంగా శిక్షించాలి

ముషీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో వైద్యురాలిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ బెటిన లంక డిమాండ్ చేశారు. మంగళవారం ముషీరాబాద్ చౌరస్తాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లంక మాట్లాడుతూ.. మహిళలపై రోజు రోజుకు దాడులు, హత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. వాటిని నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ అంబాసిడర్ డాక్టర్ రవికుమార్, జయకుమార్, భాస్కర్, సతీష్, మునిరాం, ప్రసాద్, రూప తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌కుమార్‌ను సన్మానించిన
పద్మశాలి సంఘం నాయకులు బింగి నవీన్, రంగయ్య తదితరులు

పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం అధ్యక్షుడు వి. రాజ్‌కుమార్ అన్నారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విజయం సాధించిన ఆయనను మంగళవారం ముషీరాబాద్‌లో పద్మశాలి కులస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉత్తమ విద్య అభ్యసించేందుకు కృషిచేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. తనను అధ్యక్షుడిగా గెలిపించినందుకు పద్మశాలీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలిసంఘం నాయకులు బింగి నవీన్, రంగయ్య, నర్సయ్య, ఉదయ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్‌రావు, పున్న సత్యనారాయణ, బాలరాజు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మజర్ తదితరులు

నాలెడ్జ్ జంక్షన్ పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత చేపూరి శంకరరావు రచించిన నాలెడ్జ్ జంక్షన్ ఆఫ్ ఎయిల్‌మెంట్స్ పుస్తకావిష్కరణ సభ మంగళవారం అశోక్‌నగర్ వెల్ఫేర్‌సెంటర్‌లో జరిగింది. కోవా సంస్థ డైరెక్టర్ డా. ఎం మజర్ హుస్సేన్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అనారోగ్యానికి దూరంగా ఎలా ఉండాలి, అనారోగ్యం బారిన పడితే ఎలా కాపాడుకోవాలో పుస్తకంలో శంకరరావు చక్కగా వివరించారని చెప్పారు. ఈ సందర్భంగా దివ్యాంగుడు ఖాజాకు వీల్‌చైర్, రమేష్‌యాదవ్‌కు రూ. 5 వేలు, వెన్నెముక బాధితుడు మధుసూదన్‌కు రూ. 1,500 అందజేశారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సభలో పాల్గొన్న వారికి తులసిమొక్కలు పంపిణీ చేశారు. రచయిత్రి గురజాడ శోభాపేరిందేవి, నీలం సంధ్య, పద్మ, శంకర్‌రావు, యాదగిరి, కత్తుల బాలు, ప్రకాష్‌రెడ్డి, జానకి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



వినయ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న
వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్. శశిధర్

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి

ముషీరాబాద్ కన్వీనర్‌గా వినయ్‌కుమార్

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్‌గా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి ఆర్. శశిధర్ ప్రకటించారు. మంగళవారం జరిగిన ఉత్సవ సమితి సమావేశంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు ఆలె భాస్కర్, నాయిని బుచ్చిరెడ్డి, మద్దూరి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

బర్కత్‌పుర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం, లింగంపల్లి చౌరస్తాలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 22వ తేదీ వరకు ఆరాధనోత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు పుర్వారాధన, పాదపూజ, కనకాభిషేకం రాఘవేంద్రస్వామికి మహాపంచామృతాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు జరిగాయి. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, రాఘవేంద్రస్వామి బృందావన సమితి అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి, కార్యదర్శి బి.పి, రాఘవేంద్రరావు, మేనేజర్ నర్సింహాచార్యులు, మఠం మేనేజర్ సూర్యచంద్రశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెల్లార్‌లోకి నీరు

రాంనగర్/నల్లకుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు అపార్ట్‌మెంట్లలో సెల్లార్‌లోకి వరద నీరు చేరింది. బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వర్షం నీరు నిలవడంతో రాకపోకలు స్తంభించాయి. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలోని సెల్లార్‌లో గల లైబ్రరీ, షోయబ్ హాల్‌లోకి నీరు చేరింది. నాగమయ్యకుంట, సాయిచరణ్‌కాలనీ, అంజయ్యనగర్, పద్మా కాలనీ, బాప్టిస్ట్ చర్చి, ప్రేయర్ పవర్ చర్చి, ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

అంబర్‌పేట నియోజకవర్గంలోని నల్లకుంట డివిజన్‌లో పాతరామాలయం, నర్సింహబస్తీ, సత్యానగర్, రత్నానగర్, అంబర్‌పేట, ప్రేమ్‌నగర్, బాగ్‌అంబర్‌పేట మల్లికార్జున్‌నగర్, కాచిగూడ నింబోలిఅడ్డ, గోల్నాకలోని శాంతినగర్ తదితర ప్రాంతాలలో వరద నీటితో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

మూసీ పరిసర ప్రాంతాల పరిశీలన

మూసీ పరిసర ప్రాంతాలను జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, అంబర్‌పేట డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌వో హేమలత మంగళవారం పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సేవల కోసం ఎమర్జెన్సీ సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు.

సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద నీరు నిల్వకుండా చర్యలు

సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద, ఎల్‌ఐజీ క్వార్టర్స్‌లో వరద నీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ రవిచారి తెలిపారు. వర్షం నీరు నిలువకుండా ఉండేందుకు ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. మంగళవారం వరదనీరు నిలిచిన ప్రాంతాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.



సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సెల్లార్‌లో లైబ్రరీలో వర్షపు నీరు

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు కార్లు కొట్టుకుపోయాయి. రామాలయం వీధిలో విద్యుత్ తీగలు తెగి పడడంతో మంటలు చెలరేగాయి. వినోభానగర్‌లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వరద నీరు చేరడంతో చెరువును తలపించింది.

జీహెచ్‌ఎంసీ అధికారుల ఘెరావ్

అధికారుల నిర్లక్ష్యం వల్లే వరద నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పార్శీగుట్ట వాసులు జోనల్ కమిషనర్ రవికుమార్, డీఎంసీ ఖాదర్ మొహినొద్దీన్, డీఈ సన్నీ, ఏఈ తిరుపతిని ఘెరావ్ చేశారు. చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాచిగూడలో..

బర్కత్‌పుర: కాచిగూడ డివిజన్‌లోని మౌలానా ఆజాద్‌నగర్, మోతీ మార్కెట్ పరిసర ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, ఏఈ విశ్వతేజతో కలిసి మౌలానా ఆజాద్‌నగర్‌ను సందర్శించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బందిని పిలిపించి నీటి తొలగింపునకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, ఆర్. సంతోష్, ఓంప్రకాష్, రామకృష్ణ, రవియాదవ్ పాల్గొన్నారు.



నల్లకుంట పాతరామాలయం వీధిలో కుంగిన రోడ్డును పరిశీలిస్తున్న
ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ యాకర అమృత, అధికారులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నల్లకుంటలో బాక్స్ నాలా నిర్మిస్తాం : ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో నల్లకుంట పాత రామాలయం వద్ద 14వ నంబర్ వీధిలో అనేక ఇళ్లలోకి నీరు చేరింది. రోడ్డు కుంగిపోయింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ యాకర అమృత, జలమండలి డీజీఎం కృష్ణ, జీహెచ్‌ఎంసీ, డీఈఈ ప్రవీణ్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, ఏఈలు భావన, విశ్వతేజ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యుద్ధ ప్రాతిపదికన గుంతను పూడాలని అధికారులను ఆదేశించారు. పాత రామాలయం వీధిలో ఇళ్లలోకి వరద నీరు చేరకుండా బాక్స్ నాలా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం. మధుసూదన్‌యాదవ్, తెలుగు యువత అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్, కె. వీరయ్య పాల్గొన్నారు.



వరద నీటితో నిండిపోయి చెరువును తలపిస్తున్న
ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం



మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద మూసీని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్,
అంబర్‌పేట డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో హేమలత



మౌలానా ఆజాద్‌నగర్‌లో నీరు చేరిన ఇళ్ల
బాధితులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

పద్య నాటకాలను కాపాడుకోవాలి

చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో త్యాగరాయగానసభ సహకారంతో శారద కళానికేతన్ వారు మంగళవారం గానసభలో జానపద శాస్త్రీయ కళా వేదిక నిత్యవేడుకలో భాగంగా నిర్వహించిన శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన జనరంజకంగా సాగింది. కృష్ణుడిగా టి. సత్యనారాయణ, దుర్యోధనుడిగా సంజీవరావు, ఇతర పాత్రల్లో జంధ్యాల సుబ్బలక్ష్మి, తెనాలి పంతులు, రామ్మోహన్, లింగమయ్య, నరసింగరావు, రాములు పాత్రోచితంగా నటించి నాటకప్రదర్శనను రక్తికట్టించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. తెలుగు వారి సంపద పద్యనాటకాలను కాపాడుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్ట్ శంకరనారాయణ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి ఉత్సవాల నిర్వాహకుడు రాజబాబు ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన, రాజీవ్ అవార్డుల ప్రదానంతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణకు రాజీవ్ వ్యాఖ్యానరత్న, కవి నాగభైరవ అరుణకుమార్, నటులు సత్యనారాయణ, మామిడి సంజీవరావును రాజీవ్ పురస్కారంతో సత్కరించారు. సంస్థ కార్యదర్శి అనిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో అతిథులు

'ఆర్టిజన్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలి'

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం ఐదేళ్ల పూర్తయిన ఆర్టిజన్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీయూఈఈయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టిజన్‌లు ఖైరతాబాద్‌లో దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

అంతకుముందు మింట్‌కాంపౌండ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా మింట్‌కాంపౌండ్ చౌరస్తా నుంచి దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయానికి తరలివెళ్లారు. విద్యుత్ సంస్థలు ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కార్మికులను ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో ఆర్టిజన్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



నిఖిల్‌కుమార్ (ఫైల్)

చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందాడు. పాట్నాకు చెందిన శివశంకర్‌కుమార్, శోభ చిన్న కుమారుడు నిఖిల్‌కుమార్(21) రాంనగర్ పయనీర్ కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు మూడో సంవత్సరం చదువుతున్నాడు. రాంనగర్‌లో ఓ రూమ్‌లో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై వీఎస్టీ నుంచి రాంనగర్‌లో కాలేజీకి వెళ్తున్నాడు. అదే సమయంలో పటాన్‌చెరుకు చెందిన బాలాజీ రాంనగర్ చౌరస్తా నుంచి కారులో వేగంగా వెళ్తూ నిఖిల్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన బాలాజీ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతుడి బాబాయి బిపిన్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'హైడ్రా లాంటి సంస్థను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలి'

పంజాగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో చెరువులు, కుంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీను సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం, శివారు ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయని, అందులో బహుళ అంతస్తుల భవనాలు, ఫామ్ హౌస్‌లు వెలిశాయన్నారు. చెరువులు, కుంటలను రక్షించడానికి, సహజ వనరులను కాపాడడానికి ప్రత్యేక అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీఎం చొరవతో ఏర్పాటు అయిన హైడ్రాతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 లక్షల మంది మత్స్యకారులు సంతోషంగా ఉన్నారని అన్నారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి సంస్థలు ఏర్పాటు చేసి 40 వేల చెరువులను కాపాడాలని ఆయన సీఎంకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికారప్రతినిధి గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, ఉప్పరవేని రంజిత్ ముదిరాజ్, ఎస్.మహేష్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

'వరదనీటి కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయండి'

బర్కత్‌పుర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న వరదనీటి కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి లింగంపల్లి చౌరస్తా వద్ద నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, జీహెచ్‌ఎంసీ డీఈఈ ప్రవీణ్, ఏఈ విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలి



అన్నపూర్ణకు ఆర్థిక సహాయం అందజేస్తున్న
మహేష్ అగర్వాల్, ప్రేమ్‌చంద్ మునోద్

బర్కత్‌పుర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర గోశాల ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. గో ప్రేమ మనోకామ్నా గోశాలలో పశువుల దాణా కోసం గోశాల నిర్వాహకురాలు అన్నపూర్ణకు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ కోశాధికారి ప్రేమ్‌చంద్ మునోద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గోవుల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా అమలు చేయడంలో అధికారులు, ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోవుల రక్షణకు ప్రజలే ముందుకు రావాలని కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ అధ్యక్షురాలు నిర్మలా సంఘీ, దీపక్‌సాద్, మహేందర్ గుప్తా పాల్గొన్నారు.



సింగీతం నర్సింగ్‌రావుకు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ నేత జ్ఞాపకార్థం

గంగానగర్ బస్తీకి 40 కుర్చీలు అందజేత

గోల్నాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గోల్నాక డివిజన్ మాజీ అధ్యక్షుడు సింగీతం నర్సింగ్‌రావు 6వ వర్ధంతి గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గంగానగర్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నర్సింగ్‌రావు అంకితభావంతో పనిచేశారని అన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం రవీందర్‌గౌడ్ గంగానగర్ బస్తీ కమిటీకి 40 కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.శ్యామ్‌రాజ్, కేసరి నర్సింగ్‌రావుయాదవ్, మరికంటి కృష్ణంరాజు, కె.రాంచందర్, మహ్మద్ సలీం, కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా

రాజీవ్ గాంధీ జయంతి

రాంనగర్/నల్లకుంట/ముషీరాబాద్/చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేటలో భరత్ నగర్ కమ్యూనిటీహాల్‌లో రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలకు రాజీవ్‌గాంధీ స్మారకార్థం నారీ న్యాయ సన్మాన్ సమారోహ సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు.



బాగ్‌అంబర్‌పేటలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి
నివాళులర్పిస్తున్న సునీతారావు, శంభుల ఉషశ్రీ తదితరులు



నర్సింహబస్తీలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ సేవాదళ్
రాష్ట్ర మాజీ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం, జి. లక్ష్మణ్ తదితరులు



రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న
కాంగ్రెస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ తదితరులు



ముషీరాబాద్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ జయంతిలో కాంగ్రెస్ నాయకులు
పట్నం నాగభూషణం గౌడ్, పెండెం శ్రీనివాస్ యాదవ్ తదితరులు



దాయార మార్కెట్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి
నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి
లింగాల శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనా యాదవ్ తదితరులు